# బొమ్మడిబ్బీ

'సూచి' సాయి శంకర్

**ఆ అర్ధరాత్రి గొంతువరకూ కాంతి రసాల్ని తాగిన రూపుతో ఉంది. గోరువెచ్చని కాంతి - గోధూళి కాంతి - అందాల కాంతి - అద్భుతమైన కాంతి - వెన్నలాంటి కాంతి - వెన్నెలల లాంటి కాంతి**

**అం**తా కాంతి మయం - కాంతి సమయం

అలాంటి వేళ దాని నుండి ఓ అద్భుతమైన రూపం!!

ఏవిటదీ! ఏవిటో అది!! ఏవిటై ఉంటుందీ!!!

సమస్య గొంతు దాకానింపే రూపుతో అదేదో వస్తోంది... ఎగురుకు వస్తోంది... తన ముంజేతిపైకి వస్తోంది... తనని ముద్దాడమని వస్తోంది...:

ఇంతకీ ... ఏవిటదీ! ఏవిటో అది!! ఏవిటై ఉంటుందీ!!!

'బంగారి' చీకటి కాంతుల ఊహల్లో... లోయల్లో... ఉక్కిరి బిక్కిరిఔతోంది.... మగతలో... మమతలో... మాయలో..లో...లో...

★ ★ ★

బంగారి కళ్లు తెరచింది.... చూసింది!

ఎదురుగా అమ్మ - అమ్మ చేతిలో బొమ్మ... 'చిలక బొమ్మ'. చూడగానే బంగారి కళ్లు ఇంద్రనీలాలైనాయి. పాలపుంతల పరవళ్లు తొక్కాయి. అరకన్ను తెరచిన పూబాలల నవ్వులైనాయి - రవ్వలైనాయి.

ఆ చిన్నారి తల్లి ఆనందం అనంతమైంది.

'మ్మా! బొమ్మే... నాకే..." బంగారి కుక్కి మంచం నుంచి కుప్పించిలేచి తల్లిచేతిలోని బొమ్మని అందుకుంది.

'ఏందో చోద్యం! బొమ్మని చూసి అమ్మనే మర్చేలా ఉందే... ఈ పిల్లదాని ఇద్దారం...' తల్లి పైడమ్మ ఆశ్చర్యం ఇది.

'మ్మా! ఎక్కడిదిదీ... జాతర్లో కొన్నావా... పూజారి పంతులిచ్చాడా... చెప్పమ్మా...?' బంగారి వా కే ప్రవాహం కట్టలు తెగిని గోదారే!

ఆ కెరటాల వడి వాడికి తట్టుకోలేక పైడమ్మ తను చేస్తూన్న పనిని ఆపి "మేడమంగమ్మ అన్నారం ఎల్లి.... అట్టు కొచ్చింది... పొద్దుటేలపన్లోకెల్లినప్పుడు దీన్ని నా సేతెట్టి... నే ఇచ్చానని సెప్పి బంగారి కియ్యవే పైడీ... అంది...ఇదీ బావుందా....!" అనడిగింది కూతుర్ని.

'బావుంది... బావుంది! చిలకబొమ్మ బావుంది!! గల్.. గల్..గల్ మంటోంది' గల్..గల్..గ...ల్..."

ఆశ్చర్యం అర్జున సోపానమైంది.

చెవి దగ్గరగా బొమ్మని పెట్టి ఆడిస్తే ఈ చప్పుడేవిటి చెప్మా! ఆశ్చర్యంతో బంగారి అన్వేషణ మొదలైంది. చిలకబొమ్మ పూర్తి సమాచారం దొరికింది.

'అరే! ఈ బొమ్మ.... ఈ చిలక బొమ్మ... ఉత్తి బొమ్మకాదు...

బొమ్మడిబ్బీ... బొమ్మడిబ్బీ... బొమ్మడిబ్బీ!

అరిచినంత పనిజేసింది బంగారి.

'అమ్మో! ఎంత బావుందో.... చిటారుకొమ్మ చిలకమ్మ నా చిటికెనవేలుపై వాలింది....హాయ్... హాయ్...!' అంతలో మళ్లీ సందేహం 'గలగల్లాట' ఎలా వచ్చిందీ అని.

'ఇంద ఓ రెండు రూపాయి బిళ్లలు వేసి ఇస్తున్నా ఈ బొమ్మడిబ్బీలో.... నీ బంగారికి చెప్పు.... మిగిలినవి తనని వేసుకొమను సీ్మ...." మేడమంగమ్మ మాటల్ని అక్షరం పొల్లుపోకుండా



చెప్పింది పైడమ్మ... కూతిరి ప్రశ్నార్థకమొహం చూసి.

'బొమ్మడిబ్బీ... అందులో డబ్బులూ, వాటి గలగలలూ' మైమరచి పోతోంది బంగారి. అదెంతంటే రంగడి శెట్టి బడ్డీ బెల్లం ఉండలంత తియ్యననీ.... చెరువుగట్టు ఊటబావి తేటనీటి కంటే చల్లననీ... ఇంకా... రామాలయం మీదనుంచి వచ్చే 'లవకు' పాటకంటే ... పద్యం కంటే పరమానందమనీ.

బొమ్మడిబ్బీ ఓ 'అందిన తాయిలం' బంగారికి.

★ ★ ★

ఊరిగడపల్లో పైడమ్మ చేత 'రెక్కల కట్టం' ఏయించేవి ఓ నాలుగో... ఐదో ఉన్నాయి. 'పెంకి ఘటం', 'తల్లోనాలిక', 'అమ్మా! పైడమ్మ తల్లీ!' లాంటి పిలుపుల్తో ఓ వూరి పాకలో బతుకు సమరం.

ఇక.... భర్త 'పానకాలు', పైడమ్మ భాషలో 'తాగుమోతు సచ్చినోడు'. కొంచెం కోపం పరాకాష్టకి వెళ్తే, 'థూ.... ఎదవ బతుకు' వరకూ ఉంటుంది వ్వాడితీరు.

గ్రామదేవత మారెమ్మతల్లి దయో - గంగరావి 'పెదచ్చినాలో'... 'బంగారి', పైడమ్మా పానకాలకు లేకలేక కలిగిన 'ఒగ్రం'.

ఒంటి చేతి సంపాదనతో, ఇంటి పానకాల సామి 'ఇలాసాలు'తో బతుకు బండి చక్రాన్ని పళ్లబిగువున లాక్కెళ్తోంది పైడమ్మ... అలాంటి కాలంలో...

'బొమ్మడిబ్బీ ఒకటే ప్రాణానికి!'

'నాలిక్కి రుసుంటాది... ఇంత గోగినూరి పచ్చడెట్టు... సమ్మంగా...' అన్న 'భర్తడి హుకుం'ని పైడమ్మ బుద్ధిగా అమలు చేసేవేళ...

'మ్మా! మరీ....' బంగారి గారాబం.

'సెప్పానా! సిల్లిగవ్వలేదు... రెండ్రోలాగు.. మాట్టారి భార్యనడిగిత్తా', పైడమ్మ 'రకీ' జవాబు.

'మ . మ్మా... బొమ్మడిబ్బీకి బువ్వెట్టి రెండ్రోలైంది... ఇంకా... రెం...డా...' మూతిని మూడంకెలాపెట్టి బంగారి దీర్ఘం.

'ఐతే!'

'పోనీవమ్మా... సావులోరి ముడుపు డ...బ్బు...లు.. ఇందులో... వెయ్యి....నా'

'ముడుపులా... ముద్దులా... నీ అయ్యకొయ్య ఇంటో ఉండగా ఏ డబ్బు ఉంచుతాడనీ... పనిదానివి నీ మెడకి పసుంతాడు సాలునని పని గట్టుకొని మరీ తాగుడికి తాళిబొట్టు అమ్మిన గొప్పోడు నీ అయ్య... జిమ్మడ... నిన్నటాలే గదే... ముడుపుల్ని కడుపులోకి వంపేసుకున్నాడు... ఛాండాలపోడు'.

కడుపు రగిలిన మాటలు బంగారికి అర్థం కావని తెలిసినా మాట్లాడేసింది.... పైడమ్మ.

'మరైతే!'.... అమ్మ విసుగుకు చివరి పరీక్ష.

'నా తల్లికదూ! నాల్రోలాగు నీ డిబ్బీ సంగజ్జూత్తా' బుంగమూతి పెట్టిన కూతుర్ని సముదాయిస్తూ అంది పైడమ్మ.

'ఇందాకళరెండ్రోలూ... మరిప్పుడు నాల్రోలా... ఐనట్టే!' అనే చూపొకటి తల్లికేసి బలంగా విసిరి.... లాభంలేదని చెప్పి... బొమ్మడిబ్బీ తీసుకొని, ముంతనీళ్లు గుక్కపట్టి... గుటకేస్తూ, తనకి ఇష్టమైన ప్రదేశానికి... తన గోదారి తల్లి ఒడి ఒడ్డుకి తూనీగలా తుర్రుమంది బంగారి.

ఆ వాతావరణం... ఆప్రశాంతత బంగారికి 'హాయ్..హాయ్'.

ఆ చిట్టితల్లికి అక్కడ ఎన్నెన్నో ఆటవస్తువులున్నాయి. నన్నని గాలితెర, తెరమీదుగా జారిపడే నీటి అల, అలపై భాగానికొచ్చి దోబూచులాడే చేపపిల్ల తల, ఆకాశంలో సయ్యాటలాడే మబ్బు తునకా, దాని నీడని తనివి తీరా ముద్దాడే గోదారమ్మ ఒడి, చేపల పకపకా... అబ్బో... అబ్బో... ఎన్ని బొమ్మడిబ్బీలు.. కూడబెడితే దొరికేవి ఆట బొమ్మలు. ఇవన్నీ బంగారికి ఊహ తెలిసినప్పట్నుంచీ వళ్లోకొచ్చిపట్ట నేస్తాలు.


ఐతే! వాటి పొడ ఈ మధ్య ఆ చిన్నారి మనసుకి బొత్తిగా పట్టడం లేదు.

ఆ స్థానం 'బొమ్మడిబ్బీ ఆక్రమించుకొంది'.

ఎంచక్కా గోదారంచులోకి దిగి, అక్కడ అలసి విశ్రాంతి తీసుకుంటున్న 'పడవ' మల్లని రాదారి పడవ అంచున కూర్చుని, 'తేగపాయో', 'లీపి చెఱకో', రాట్నం కొండయ్య కనిపెట్టిన 'అల్లం మురబ్బా'యో నవుల్తూ, అరిపాదాల్ని అలల చెలులకప్పగిస్తూ వాటి నుంచొచ్చే చిత్ర శబ్ద సంగీతాల్ని వింటూ పచ్చిబాలింత తన బడిశిశువుని ముద్దాడి, మురిసేంతటి ఆప్యాయతతో బొమ్మడిబ్బీని తన్మయత్వంతో లాలిస్తుంది బంగారి. ఆ వైనం గోదారమ్మ చేపకళ్లేసుకుని చూసి తీరాల్సిందే.

పదేపదే బొమ్మడిబ్బీని నిమురుతుంది - ముద్దాడుతుంది. దానితో.. మాట్లాడుతుందీ... పాట్లాడుతుంది. దాన్నించి వచ్చే 'గలగల' శబ్దాల్ని తనదైన భాషలోకీ, భావంలోకీ తర్జుమా చేసుకుంటుంది. ఆనక ఆ భావానికి తగ్గ భావం తన చేతల ద్వారా దానిపై కురిపిస్తుంది.

బొమ్మ డిబ్బీ తనతో ఏవేవో ఊసులు చెప్తోందన్న భావం బంగారిది. డబ్బు గొప్పదనం, డబ్బు పాపిష్ఠితనం, డబ్బు మగత, డబ్బు భవిత అన్నీ దొంతులు దొంతులుగా వచ్చి చేరే ఊహల్ని



మించిన ఊహ ఆమెది.

అదేవంటే! బొమ్మడిబ్బీ... తనూ...ఓ 'తీయని బంధమని'

పుట్టి బుద్దెరిగాక బంగారి మనసునింత ఆకట్టుకొన్న నేస్తం ఏదీలేదు. ప్రొద్దుట కళ్లు విప్పినప్పట్నుంచి, రాత్రి కళ్లు మూసేదాకా... ఆ మాటకొస్తే కళ్లుమూసినా బొమ్మడిబ్బీ...ఓ.... 'మంత్రలోకపుమణి' ఆ లేత కళ్లకి, ఆ పసిమనసుకి.

కాలం బొమ్మడిబ్బీలా 'గల్‌గల్'మంటూ జరుగుతూండగా... ఓవేళ....

'సిగ్గులేదయ్యా! ఆ పనేందంట... పాడుబుద్ధి... కుక్కబుద్ధి... ఛూ...' తండ్రిని తిడుతోన్న తల్లిని గమనిస్తోంది బంగారి. అసలే నల్లనైన తల్లి కళ్లలో ఎర్రజీరలో ఏదో ఆక్రోశం ఆ చిన్నారి చిట్టితల్లికి లీలగా బోధపడుతోంది. ఆ గొడవలోనే... మధ్య మధ్య తన గుండె చేరి పదిలపడ్డ బొమ్మడిబ్బీని పదే... పదే.... తడిమి తృప్తి పడుతోంది.

'ఇప్పుడేటయ్యిందనీ... ఇంత గొడవ...' నెమరువేత ధోరణిలో ముద్దముద్దగా మాట్లాడుతున్నాడు పానకాలు.

'ఏటైందనా... సూడయ్యా! దాని బయం... బిడ్డ పుట్టినప్పట్నుంచీ కనీసం తలైనా నిమిరావా... కడుపుకింత ఇష్టంగా పెట్టావా... కసాయి సారా మీదున్న మమకారం కన్న కూతురి మీద లేదేవయ్యా నీకూ...' పైడమ్మ బావురంది.

'ఆఁ..... అదీ......' పానకాలు గుటకల తీరు.

'ఛస్! బొంకకయ్యా!' కడుపుకింత గంజెట్టే నాకే దాన్ని తిట్టే నాలిక లేదు. మధ్యనీకేందని. ఇంకోసారి... ఇలా జరిగిందో....' చెరువుగట్టు మారెమ్మతల్లి కళ్లు అమ్మకళ్లలో చూసింది బంగారి.

మారుమాటలేక - నేలచూపులు చూస్తూ పానకాలు అక్కణ్ణుంచి ఉడాయించాడు. బిక్కుబిక్కుమంటున్న కూతుర్ని దగ్గరకు చేరబిలిచి.. 'అయ్య మరి రాడులే... ఇంక భయంలే.. నీ బొమ్మడిబ్బీకేం కాదు' అంటూ ఊరడించి పన్లో కెళ్లింది పైడమ్మ.

జరిగిన విషయం తల్చుకుంటే బంగారి బేల కళ్లలో భయం... ఒకటేభయం.. సనసన్నని భయం.

అసలు విషయం జరిగిన తీరు ఇదీ....

బువ్వతిని పడుకున్న బంగారి కౌగిల్లో బొమ్మడిబ్బీ గూటిలోని రామచిలకైంది. తియతీయని డిబ్బీ జ్ఞాపకాల ఊహాలోకంలో మునకలేస్తోందా చిన్నారి. అలాంటి సమయంలో చిన్న కుదుపు! ఎవరో వికారుడు, శకారుడు తన బొమ్మడిబ్బీకెదో ఆపద కలగజేస్తున్న భావన కళ్లలో కదలాడి ముచ్చెమటలూ పట్టాయి. గొంతు తడారింది. అమ్మని పిలుద్దామనే ఊహతో కళ్లు తెరిచింది... ఎదురుగా... 'అయ్య!' డేగ చూపుతో... పాములూపుతో... తనబొమ్మడిబ్బీని మింగాలని వచ్చాడు. దొంగోడు...

'మ్మా!' బంగారి కేక గుడిసెని ఊపింది.

కూతిరి కేక విని పరుగునొచ్చి చూసి




నిర్ఘాంతపోయింది పైడమ్మ. బంగారి చేతిలోని బొమ్మడిబ్బీని లాక్కుంటున్నాడు పానకాలు. తేరుకుని అడ్డెళ్లింది. పెనుగులాడింది. పెనుగులాటలో పై చేయి పైడమ్మదే.

బొమ్మడిబ్బీ రూపం నిలిచింది! బంగారి ప్రాణం నిలబడింది!!

'తనకి కొండంత అండ-ధైర్యం.... అమ్మ' ఇది బంగారి భావం.

తాగుడికి ఉన్న డబ్బు సరిపోక... ఆఖరికి పసిదాని డబ్బీ డబ్బుల్ని కూడా 'వలిచేసుకునే' సంస్కారం ఏ సారా గుక్కలోంచి పుణికి పుచ్చుకున్నాడో పానకాలు. వాడి ఎర్రకళ్లు పచ్చని చిలకబొమ్మ డిబ్బీపై పాము చూపుల్లా పాకాయి.

'అమ్మో! ఇప్పుడు... ఇలా... మొదలైంది. ఇంకా ఎన్ని బాలారిష్టాలు.... దాటాలో నా బొమ్మడిబ్బీ! లేత భుజాల మీద ముసలితల ఆలోచనలతో ఉండిపోయింది బంగారి.

ఇక అప్పటినుంచి బొమ్మడిబ్బీని ఎక్కడ దాచాలా అనే దిగులు అలముకొంది ఆ చిన్నారి మనసులో.. ఇవేళైతే సమయానికి అమ్మఉంది. రేపు... అమ్మలేనపుడు... అయ్య నిజంగా డిబ్బీని లాగేసుకుంటూ... పగలేసుకుంటే...' భయం లేత వెన్నులో చలి పుట్టించింది.

బొమ్మడిబ్బీకి 'రక్షణ' కావాలి. దాన్ని ఎక్కడైనా దాచాలి. అన్ని చోట్లూ ఊహించింది. తృప్తికలగలేదు. గోదారి నేస్తాలకి అప్పగిస్తే... అమ్మయ్యో... అవితన ప్రాణాన్ని... తన డిబ్బీ బుడతని తమలో కలిపేసుకోవూ! అందుకే ఆలోచనలకి స్వస్తిచెప్పి... తన డిబ్బీకి భద్రమైన... భద్రమైన చోటు 'తన కౌగిలే' అని తీర్మానించుకొంది బంగారి.

ఎప్పుడైతే ఆలోచనిలా వచ్చిందో... కర్ణుడైనా కవచకుండలాల్ని వదిలాడు కానీ... బంగారి బొమ్మడిబ్బీని అసలు వదలడం లేదు. అది ఆమెకు మనసున మనసైంది.

కాలం ఇలా ఉంటే అలుసైపోదూ.. అందుకే ఈసారి బొమ్మడిబ్బీపై పానకాలు వేటు బలంగా పడేలా చేసింది. ఎలా అంటే...

బొమ్మడిబ్బీని కాపాడునే విషయంలో మథనపడే బంగారిలో కాస్తంత బెంగ ఆవగింజలా మొదలై అనంతంగా ఎదుగుతోంది. ఆ భయం కొద్ది కొద్దిగా... జ్వరంలోకి మారి... అలసట ఆవహించింది. మంచాన చేరేలా చేసింది. కాకపోతే బొమ్మడిబ్బీ కూడా ఉందనే కొండంతగా ఆ పిల్లలో సంతోషాన్ని పాదుగుతోంది.

ఇలా ఉంటూండగా ఓ రోజు అలసి నిద్రపోతున్న బంగారి చేతుల్లోని... మట్టిడిబ్బీ... బొమ్మడిబ్బీ.... ప్రాణమైన డిబ్బీ.. మాయమైంది. విషయం వెంటనే గ్రహించి మంచం మీంచి ఒక్కకేకతో లేచి సుడిగాలిలా మారి గుడిసెను... కలియ బెట్టింది. అలసింది.... అలసింది... అవిసింది... సొమ్మసిల్లింది. శోష తెచ్చుకుంది.

పాపం! సమయానికి అమ్మ సాయం లేకపోయింది.

ఏదీ! తన ప్రానం... తన సర్వసం...తన బొమ్మడిబ్బీ ఏదీ.. ఎటెగిరిపోయిందా చిట్టి చిలక తల్లి... ఏ గండుపిల్లి పట్టిందీ... ఏ పాము చూపు మింగిందీ... గండుపిల్లి! పాము చూపు!!

'అయ్యా!'..... కేక... బంగారి కేక... ఎక్కడో గోదారమ్మ బడిలోని నేస్తాలంతా ఉలిక్కిపడే కేక నిశ్చేష్టురాలైంది గోదారిలోకం.... అంతా నిశ్శబ్దం..... నిశ్శబ్దం.....

★ ★ ★

'ఎదవ సచ్చినోడు! ఆడిజిమ్మడ... పసిదానికి పెట్టేది పోయి, పాపిష్టి పని చేశాడు... ఛూ....' కోపం... ఉక్రోషం.... ఏం చేయాలో తెలీని అయోమయం మెటికల రూపు కట్టి ఉవ్వెత్తున తన్నుకొస్తుంటే పైడమ్మ... తనో బంగారిగా మారిపోయి బాధపడుతోంది బొమ్మడిబ్బీ తల్చుకొని.

'సిరిగొయ్యి రావిసెట్టుకాడ... దాని మొదట్లో పగలగొట్టి పడేశాడు... ఇంద... ఇయి సూసైనా కొంత నిమ్మదిపడు సిన్నారీ... కాస్తంత ఎంగిలిపడు బంగారీ... నా తల్లివి కదూ...' ఎంతో శ్రమపడి బొమ్మడిబ్బీ ముక్కల్ని వెదికి తెచ్చి కూతురి కళ్లతో స్పృశిస్తోంది బంగారి. ఆ పసికళ్లలో వెకటి కాంతిలదు. ఆ పసిశరీరంలో వెనకటి కళలేదు. దుమ్ము పట్టిన లేత ముందారకులా ఉంది ఆ పసిదాని తీరు.

పాపం! బంగారి కళ్లు ఉభయగోదార్లైనాయి.

దీనికి గోదారమ్మే ఆశ్చర్యపోయింది. తనలోకన్న బంగారి కళ్లలో నీళ్లెక్కువని!

సరిగ్గా అప్పుడే ఓ చిత్రం జరిగింది. దాన్ని చూసిపైడమ్మ అయోమయం ఐంది. అలసి వాలిపోతూందనుకున్న బంగారి ముందుకెళ్లి బొమ్మడిబ్బీ ముక్కల్ని దోలిసి పట్టి, అప్యాయతల్ని రంగరించి పెట్టి, ముద్దుల వర్షం కురిపించిది. గుండెకు హత్తుకుంది.

క్షణంలో కళ్ల గోదార్లనాపి - కాంతి వలయాల్ని వెలిగించింది.

తండ్రి పాము తన చిలకపాపకి చేసిన ద్రోహాన్ని 'ఓటి కుండలా' వదిలింది. తల్లి బాధకి పోగట్టడానికి లేని నవ్వుల్ని - రవ్వల్ని కూడగట్టుకుంది. మామూలైంది బంగారి.

బొమ్మడిబ్బీ ముక్కల్ని నిర్మాల్యంగా తలనెట్టుకుంది - ఆడింది పాడింది.. పూర్వపు బొమ్మడిబ్బీ గలగల్ని మళ్లీ మళ్లీ విన్నట్లు కేరింతలు పోయింది.

కాలం బొమ్మడిబ్బీ ముక్కలుగా మారి బంగారి ముందు ఓడిపోతోంది. ఆమె చిన్నారి హృదయవైశ్యాల్ని చూసి నిశ్చేష్టురాలయితోంది.

ఎప్పటి లాగే పనులు ముగించి పైడమ్మ గూటికొచ్చాడపుటికి బంగారి అలికిడి లేదు. ఎక్కడికి వెళ్లినా తనొచ్చేవేళకి తన కాళ్లని లేగ మాదిరి చుట్టేసే కన్నకూతురి మమకారం కనపడక ఎందుకో కొంత అలజడికి గురై... ఏదో జ్ఞాపకం వచ్చి గోదారొడ్డుకి వెళ్లింది.

అక్కడ.... తన కూతురు...తన ఆశాదీపం... ఎంతో ఏకాగ్రతతో.. ఏదో పనిలో నిమగ్నమై ఉంది. ఆ పనిని చూసి పైడమ్మ చలించిపోయింది. అప్రయత్నంగానే కూతురి వైపు రెండు చేతులు జోడించింది. ఆగని కన్నీటి ధారలతో కూతురికి అభిషేకం చేసింది.

తనే తన కన్న కూతురి కడుపున పుట్టి, అమ్మల్ని పెంచిన అమ్మ ఒడిలో తరించిపోవాలని కోరుకుంది.

ఐతే ఇవన్నీ పట్టనట్లు... నిర్లిప్తంగా తను చేస్తున్న పనిని పూర్తి చేసి, తృప్తిపడి, తల్లివైపు చూసి ఆమె చేతిని అందుకొని అందులో ఓ పిడికెడు మట్టి పోసింది బంగారి.

పైడమ్మ హృదయం ఆ క్షణంలో అనుకోని అనుభూతికి వేదికైంది.

ఆమె గోదారంత విశాలంగా మారి తడిసి ముద్దైపోయింది. ఇది దుఃఖంతో కాదు... ఆనందంతో... అనంతానందంతో.... అపరిమితానందంతో... బ్రహ్మానందంతో....

'మ్మా!' గొడ్లతాతనీ, జంతికల తాయిలాలమ్మనీ, శాస్త్రిగారి తువ్వాయినీ అందర్నీ, అన్నిటినీ ఇక్కడ... ఈ మట్టిలోనే కదే దాచిపెట్టార్ట... సనిపోతే! సనిపోయినోళ్లు.... పూజారయ్య సెప్పినట్లు దేవుడి దగ్గరకెల్తారట్టకద. మరి నా బొమ్మడిబ్బిని ఈ మట్టిలో దాచిపెడితే.... దేవుడి దగ్గకెళ్తుంది కదా...ఇంక.. 'అయ్యబయం' దాని కుండదుగా... సామి దాన్ని కంటికి రెప్పలా సూత్తాడు కదా.... అందుకే... ఇ...లా...'

స్వచ్ఛతకి నిలువెత్తు గుర్తులైన బంగారి కళ్లల్లోంచి... ఆర్ద్రత నావిష్కరించే ఆమె మదిమూలలనుంచి పైడమ్మ చిగురుచెవికి వినిపించిన 'అమృతాక్షరాల సొగసు' ఇది.

బంగారిది నిజంగా లేత భుజాల మీద ముసలి తలే... ముసలితల కాదు, జ్ఞానితల - ఓ మహాజ్ఞాని తల. లౌకికంలో కూడా తాదాత్మ్యపు చెమ్మ చూపించే తల. బంగారి బంగారం కంటే గొప్పది. ఆ మాటకొస్తే కనపడని సామి కంటే కరుణ గలది. భాపరంపరలో తడుస్తూ... తన చేతిలోని మట్టిని గోతిలో ఉన్న బొమ్మడిబ్బీ ముక్కలపై పోసింది పైడమ్మ.

అవధులు లేని కన్నీటి సముద్రాన్ని అరనవ్వుతో మిళాయించి తన బొమ్మడిబ్బీ ముక్కల్ని చివరిసారి... చివరి సారి... తనివి తీరా చూసి కొద్ది కొద్దిగా మట్టిని వాటిపై చల్లుతూ.... తన ప్రాణాన్ని... తన బొమ్మడిబ్బీని మట్టి ఊయల్లో పెట్టి శాశ్వతంగా జోకొట్టింది ఆ పసి(డి) తల్లి బంగారి.

జరుగుతున్న సంఘటనని చూసి 'బంగారి మనోదీప్తుల్ని' దతట్టుకోలేక సిగ్గిల్లి సూర్యుడు మొహంచాటేశాడు ఆక్షణంలో... ఉత్తర క్షణంలో చుక్కల లోకం పొడుచుకుంది.

'మ్మా! అదిగదిగో.... నా బొమ్మడిబ్బీకి నాకంటే మంచి చుక్కలనేస్తాలు దొరికారే అక్కడ - అరే... కాంతిరాగాలతో స్వాగతం చెప్తున్నారే... చూడు... చూడు...' అన్నట్లుగా బంగారి వైపు చూస్తోంది.

పైడమ్మ ఐతే బాహ్యంలో నిలబడి ఉన్నా, అంతరాంతరాల్లో తన చిన్నారి బంగారి పెద్దమనసుకు సాష్టాంగపడి ఉంది... పడుతూనే ఉంది.

ఈ గాథ గోదారి గావిలో పదమై పలుకుతూనే ఉంది.


శిశువుల అన్ని వ్యాధుల నివారణకు

బయో-సాల్ దివ్యౌషధము

బయో-సాల్ ఎంతో రుచికరమైనది. ఇందులో మద్యం లేదు. బైకార్బొనేట్లు లేవు. మత్తుపదార్థాలు లేవు. ఇది మూలికలతో తయారైనది. ఇది మిక్కిలి క్షేమకరమైనది. పసిపాపలకు, పెరిగే బిడ్డలకు వచ్చు జీర్ణాశయ వ్యాధులకు నమ్మకమైన ఔషధం. ఇది జీర్ణశక్తిని పెంచును. ఆకలిని అధికం చేస్తుంది. కడుపు నొప్పులకన్నింటికి వెంటనే ఉపశమనమునిచ్చి బిడ్డలకు ఉత్సాహము కలిగిస్తుంది. బయో-సాల్ బిడ్డలకు ఎల్లప్పుడు ఆరోగ్య, ఉత్సాహ ఉల్లాసములను కలిగిస్తుంది.






J.& J. DeChane
Laboratories Private Limited
4-1-324 Residency Road
Hyderabad - 500 001 India

బయో-సాల్